క్లుప్తంగా

బీటెక్ విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్ఎఫ్ఎస్ సభ్యులు

కడియం: వీరవరం గ్రామానికి చెందిన షేక్ రఫీ బీటెక్ చదువుతున్నాడు. అతడు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ (ఎస్ఎఫ్ఎస్) సంస్థ సోమవారం రూ.25 వేలు ఆర్థిక సాయం చేసింది. ఎస్ఎఫ్ఎస్ సంస్థ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భవిష్యత్తులో కూడా అతడి చదువుకు తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విస్సాప్రగడ కిరణ్, గోపాలకృష్ణ, యర్రా కృష్ణబాబు, సదాశివుని సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుబ్బారావు తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక జ్ఞాన సరస్వతీ పీఠంలో ఈనెల 15 నుంచి 24 వరకూ దసరా మహోత్సవాలు నిర్వహిస్తామని పీఠం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం పీఠంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పీఠం ప్రధాన అర్చకుడు ప్రకాష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు నివాళి

సీటీఆర్ఐ: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు డాక్టర్ కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా క్వారీ మార్కెట్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ కుమార్, ఇన్‌చార్జి పడమటి గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ దళిత, బహుజనులను అభ్యున్నతికి కాన్షీరామ్ కృషి చేశారన్నారు. అనంతరం వృద్ధులకు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఇన్‌చార్జి మోత మోహన్, రూరల్ ఇన్‌చార్జి కొండపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో జాబ్‌మేళా

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. దీనిని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ప్రారంభించారు. కంప్యూటర్ ఆపరేటర్లు, సూపర్ వైజర్లు, అకౌంటెంట్ ఉద్యోగాలకు టెక్నోటాక్స్, ముత్తూట్ ఫైనాన్స్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు, మోటో కార్ప్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారు. జాబ్ మేళా నిర్వహణకు ఏర్పాట్లు చేసిన ఇంటెన్షిప్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.నీరజ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవకుమారి అభినందించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.అనూరాధ, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునీత పాల్గొన్నారు.

జేసీఐ జోన్ 26 ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ ప్రియాంక



డాక్టర్ అనుసూరి ప్రియాంక

రాజమహేంద్రవరం సిటీ: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) నూతనంగా ఏర్పాటు చేసిన జోన్–26 ఉపాధ్యక్షురాలిగా నగరానికి చెందిన డాక్టర్ అనుసూరి ప్రియాంక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన జేసీఐ ధృవ జోన్ సదస్సులో ఈ ఎన్నిక జరిగింది. గతంలో డాక్టర్ ప్రియాంక రాజమహేంద్రవరం గోదావరి జేసీఐ అధ్యక్షురాలిగా సేవలు అందించారు. ఉత్తమ ప్రతిభ జోన్ శిక్షకురాలిగా అవార్డు అందుకున్నారు.

గ్యాస్ సిలిండర్లు పట్టివేత

కంబాలచెరువు: అక్రమంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను విజిలెన్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఆర్యాపురంలోని శరవణ అయ్యప్ప హోటల్లో గృహావసరాలకు వాడే గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. అక్కడ ఉపయోగిస్తున్న ఐదు సిలిండర్లను పట్టుకుని, యజమాని జంగా లవకుమార్‌పై కేసు నమోదు చేశారు. సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి రీజినల్ విజిలెన్స్ అధికారి కె.కుమార్ హెచ్చరించారు. దాడిలో కార్యాలయ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవకుమార్, రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు పాల్గొన్నారు.

6,376 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏడోరోజు సోమవారం జిల్లావ్యాప్తంగా 12 వైద్యశిబిరాలు నిర్వహించారు. వీటిలో సాయంత్రం 6 గంటలకు 6,376 మంది రోగులు వైద్యసేవలు పొందారు. వీరిలో 244 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశామని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ మౌనిక తెలిపారు.

గోదావరి గట్టు.. దారుంటే ఒట్టు



గోదావరి గట్టు రోడ్డుపైకి విస్తరించిన చెట్ల కొమ్మలు



రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన భారీ గొట్టం

- రోడ్డుపైకి చొచ్చుకువచ్చిన చెట్లు
- రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు

ధవళేశ్వరం: గ్రామంలోని సాయిబాబా గుడి నుంచి ధవళేశ్వరం కంచర్లలైన్ వెళ్లే గోదావరి గట్టుపై చెట్లకొమ్మలు చొచ్చుకురావడంతో దారి దాదాపు మూసుకుపోయింది. మరో పక్క ఆవ డ్రైన్ నుంచి నీరు తోడేందుకు రోడ్డు మధ్యలో భారీ గొట్టాన్ని ఏర్పాటు చేయడంతో అటుగా వాహనాలు వెళ్లేందుకు సాధ్యపడని పరిస్థితిని నెలకొంది. కంచర్లలైన్ వెళ్లేందుకు స్థానికులు నిత్యం ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం రోడ్డు పూర్తిగా మూసుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిపోయిన కొమ్మలు

ఇటీవల కురిసిన వర్షాలకు చెట్టు బాగా పెరిగిపోయి కొమ్మలు రోడ్డుపైకి చొచ్చుకువచ్చాయి. అటుగా రాకపోకలు సాగించేవారికి ఇవి తగిలి గాయాలపాలవుతున్నారు. ధవళేశ్వరం ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉండటంతో స్థానికులు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుండేవారు. రాత్రి సమయాల్లో లైట్లు లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి రోడ్లకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా రాకపోకలకు అనువుగా రోడ్డును తీర్చిదిద్దాలని సూచిస్తున్నారు.

వీధి దీపాలు లేక..

ధవళేశ్వరం – రాజమహేంద్రవరం ప్రధాన రహదారి రద్దీగా మారడంతో అధిక శాతం మంది గోదావరి గట్టు రోడ్డుపై నుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. సాయిబాబా గుడి వరకూ రోడ్డును పుష్కరాల సమయంలో అభివృద్ధి చేశారు. కంచర్లలైన్ వరకూ స్థానికులు గోదావరి గట్టు రోడ్డు మీదుగా ప్రయాణం సాగించేవారు. ప్రస్తుతం ఈ రోడ్డులో చెట్లు పెరిగిపోవడంతో పాటు లైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

రాజమహేంద్రవరం సిటీ: స్పందన కార్యక్రమానికి ప్రజలు అందించిన అర్జీలకు అధికారులు జవాబుదారీ తనంతో కూడిన పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 14 అర్జీలు వచ్చాయి. కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై వినతులు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

ఎనిమిది అర్జీల స్వీకరణ

సీటీఆర్ఐ: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌సీ) డివిజన్ తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆర్డీవో తరపున ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి 8 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జీఏఎల్ఎస్ దేవి, అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో సమస్యలు వింటున్న కమిషనర్ దినేష్ కుమార్

విద్యార్థుల ఘర్షణ

కంబాలచెరువు: ఇంటర్మీడియెట్ విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనపై సోమవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలిసిన రెండో పట్టణ పోలీసులు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గాయపడిన వారికి చికిత్స అందించి ఇళ్లకు పంపించి వేశారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రమణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ రాజమహేంద్రవరం నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ సూచించారు. సీతంపేటలోని ప్రగతి జూనియర్ కళాశాలలో సోమవారం మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ ఆశయ సాధనలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, తీసుకున్న వారికే విధించే శిక్షలపై అవగాహన కలిగించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, అమ్మకాలు, నిల్వలు, వినియోగించడం తదితర విషయాలు తెలిస్తే 91777 44055 నంబర్‌కు, టోల్ ఫ్రీనంబర్ 14500కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఈబీ ఎస్సై బి.అప్పారావు, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సాయి కళ్యాణ్ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.

శిబిరంలో 574 మందికి వైద్య సేవలు



కాతేరులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు 4 గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 574 మందికి వైద్యసేవలు అందించారు. 20 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫరల్ చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ సచివాలయ కన్వీనర్లతో కలిసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈఎన్‌టీ స్పెషలిస్ట్ సంగీత, రేడియెథెరపిస్టు జి.శ్రీనివాస్, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ నేతృత్వంలో డాక్టర్లు లిడియా సుచిత్ర, ఈ.నాగదుర్గ, జగదీష్ కృష్ణ రోగులకు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు, ఈసీజీలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్ వైజర్ మేరీ నేతృత్వంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, కాతేరు సొసైటీ అధ్యక్షుడు ఆచంట కల్యాణ్, సచివాలయ కన్వీనర్లు మద్దా దుర్గారావు, సురేంద్ర, సురేష్, పార్టీ నాయకులు యెజ్జు వాసు, మానుకొండ వెంకటరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత సందర్శించారు.

రామ్మోహనరావు సేవలు చిరస్మరణీయం



సుబ్బారావు నగర్‌లో జక్కంపూడి రామ్మోహనరావుకు నివాళి



ధవళేశ్వరంలో రామ్మోహనరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- స్మరించుకున్న వక్తలు
- జనయోధుడికి వాడవాడలా నివాళి

రాజమహేంద్రవరం సిటీ: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా సోమవారం వాడవాడలా నివాళులర్పించారు. క్వారీ ప్రాంత అభివృద్ధికి జక్కంపూడి రామ్మోహనరావు ఎంతో కృషి చేశారని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ పార్లమెంట్ అధ్యక్షుడు మాసా రామ్‌జోగ్ అన్నారు. 49 డివిజన్ సుబ్బారావు నగర్‌లోని బత్తిన ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో జక్కంపూడి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆసపు చిన్న సత్యనారాయణ, సోమాబత్తుల శ్యాంకుమార్, వారా కృష్ణ పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: జక్కంపూడి రామ్మోహనరావు వర్ధంతిని పురస్కరించుకుని మండలంలో ఆయన విగ్రహాలకు స్థానిక నాయకులు పుష్పాంజలి ఘటించారు. బుర్రిలంక, దోసాలమ్మ కాలనీ, కడియపులంక, జేగురుపాడు గ్రామాల్లో నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. జేగురుపాడులో పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ కొత్తపల్లి మూర్తి, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ బుడ్డిగ వీర వెంకట్రావు గౌడ్, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: జక్కంపూడి రామ్మోహనరావు ఆదర్శప్రాయుడని అని వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, సాధనాల చంద్రశేఖర్ (శివ), గరగ శ్రీనివాసరావు, గోలి దేవకుమార్, శ్రీరంగం బాలరాజు, డాక్టర్ చొల్లంగి సత్యగిరి అన్నారు. ఆయన వర్ధంతిని ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లో నిర్వహించారు. పందెళ్ల భాను ప్రసాద్, నారపురెడ్డి మురళీ, బర్రి కామేశ్వరరావు, కేతా సాయి, కల్యాణి రెడ్డి, ముత్యాల జాన్, గూటం రాజు, గఫూర్, బాబీ పాల్గొన్నారు.

బొమ్మూరులో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వైఎస్సార్ సెంటర్‌లో గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీ ఆధ్వర్యంలో జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన చిత్రపటానికి యెనుముల త్యాగరాజు పూలమాల వేశారు. మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, పార్టీ నాయకులు ఎలుగొండ లక్ష్మీ, మేడపాటి సద్గుణ రామారెడ్డి, టీవీ రమణ, కాకులపాటి కుమార్, మరడాపు శేఖర్, నిమ్మన నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బొమ్మూరులో రామ్మోహనరావు చిత్రపటానికి పుష్పాంజలి

విలువిద్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విలువిద్య పోటీల్లో విజేతలుగా నిలిచిన ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్‌కిడ్స్ స్కూల్ విద్యార్థులు ఇటీవల పిఠాపురంలో జరిగిన జిల్లాస్థాయి విలువిద్య(ఆర్చరీ) పోటీల్లో ప్రతిభ చూపారని పాఠశాల డైరెక్టర్ యేలేటి రవిబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. సీనియర్ బాలుర విభాగంలో బి.బాలాజీ స్వర్ణ, సాహిత్ రజత, చాణక్య కాంస్య, బాలికల విభాగంలో జోషిత స్వర్ణ పతకం సాధించారన్నారు. జూనియర్ బాలుర విభాగంలో బి.బాలాజీ స్వర్ణ, సాహిత్ రజత, చాణక్య కాంస్య, జూనియర్ బాలికల విభాగంలో జోషిత స్వర్ణ, సంయుధ రజత పతకాలు గెలుచుకున్నారన్నారు. వీరందరూ నవంబర్‌లో రాజస్థాన్‌లో ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సీనియర్, జూనియర్ మెన్ అండ్ ఉమెన్ ఇండియన్ రౌండ్, కాంపౌండ్, రికర్వ్ ఆర్చరీ జట్ల ఎంపిక కోసం ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకూ కడప జిల్లాలో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే ఈనెల ఆరు నుంచి 9వ తేదీ వరకూ హర్యానాలో జరిగిన ఐసీఎస్ఈ జాతీయ టేబుల్ టెన్నిస్ టీం ఈవెంట్ పోటీల్లో అండర్–19 విజేతలుగా గిడుతూరి సిరి పావని(10వ తరగతి), గిడుతూరి తాన్వశ్రీ (7వ తరగతి), శరణ్యా రెడ్డి (9వ తరగతి) రజత పతకాలు సాధించారన్నారు. ఆ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ యేలేటి రవిబాబు, చైర్‌పర్సన్ యేలేటి విజయ, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, డీన్ హర్షిణి, వైస్ ప్రిన్సిపాల్ సైదాబాను, శ్రీవల్లి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు



జేగురుపాడులో పరీక్షలు చేస్తున్న డాక్టర్

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకే ప్రభుత్వ ఆరోగ్య సేవలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని ఎంపీడీవో కె.రత్నకుమారి అన్నారు. మండలంలోని జేగురుపాడులో సోమవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మణిజ్యోత్స్న ఆధ్వర్యంలో ఈఎన్‌టీ, పీడియాట్రీషియన్, గైనకాలజీ, జనరల్ విభాగాలకు చెందిన వైద్యబృందం జెస్సీ సుప్రియ, నాగసాయిమౌర్య, స్వరూప సుమారు 620 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 150 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, 17 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 15 మందికి ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ తన చందన చేయూత ట్రస్టు ద్వారా శిబిరం వద్దకు వచ్చిన గ్రామస్తులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వీరశివాజీ, పుట్టా బుజ్జి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇష్టంతో పనిచేస్తే ఉన్నత శిఖరాలు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అబ్బారెడ్డి నాగేశ్వరరావు తదితరులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సోమవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మోట్ సైంటిస్ట్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వృక్ష శాస్త్రవేత్త డాక్టర్ అబ్బారెడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ అరుణాచల్‌ప్రదేశ్‌లో పని చేసిన సమయంలో గుర్తించిన దాదాపు 36 జాతుల ఆర్కిడ్ మొక్కల విశిష్టత, ఆర్థిక ప్రాముఖ్యత, ఔషధ విలువలను వివరించారు. ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న రంగంలో ఇష్టంతో పనిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ప్రేరణ కలిగించడంతో కోసం వివిధ రంగాలలో విశిష్ట వ్యక్తులను ఆహ్వానించి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వారి నుంచి ఉత్తేజం చెంది విద్యార్థులు తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొబైల్ అన్నదానం అభినందనీయం



పుష్కరఘాట్‌లో జరుగుతున్న అన్నదానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవాసంస్థ చేపట్టిన మొబైల్ అన్నదాన కార్యక్రమం నాలుగో వసంతంలోకి అడుగు పెట్టడం సంతోషం కలిగిస్తోందని విశ్రాంత ఆర్డీవో జితేంద్ర అన్నారు. స్థానిక పుష్కరఘాట్ వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు, లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ కోవిడ్ సంక్షోభ సమయంలో పేదల ఆకలిని తీర్చడానికి ఈ సేవా కార్యక్రమం రూపుదిద్దుకుందన్నారు. కోవిడ్ తదనంతరం కూడా సేవలు కొనసాగుతున్నాయన్నారు. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ పిలుపును అందిపుచ్చుకుని స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఆధ్వర్యంలో 2020 అక్టోబర్ 10న ఈ మొబైల్ అన్నదానం ప్రారంభించామన్నారు. నేటికి 1,095 రోజులుగా కొనసాగిస్తున్నామన్నారు. ప్రతి రోజూ పుష్కర ఘాట్, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 400 మందికి భోజనాలు పెడుతున్నామన్నారు. కార్యక్రమంలో కె.గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, అనూప్ జైన్ పాల్గొన్నారు.

కారుణ్యానంద స్వామి జీవితం ఆదర్శనీయం



నాటక కళాకారులను సత్కరిస్తున్న కొండబాబు తదితరులు

సీటీఆర్ఐ: కారుణ్యానందస్వామి జీవితం అందరికీ ఆదర్శమని గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు అన్నారు. నారాయణపురం వద్ద గల గౌతమీ జీవకారుణ్య సంఘం ఆశ్రమ ప్రాంగణంలో సోమవారం లక్ష్మీసౌమ్య కళాజాత బృందంచే సంస్థ వ్యవస్థాపకుడు కారుణ్యానందస్వామి చరిత్రను నాటకంగా ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఈ నాటకంలోని స్వామి జీవితానికి సంబంధించిన పలు సన్నివేశాలు కంటతడి పెట్టించాయి. అనంతరం బర్రే కొండబాబు మాట్లాడుతూ కొందరు మహానుభావులు లోక కళ్యాణం కోసమే పుడతారన్నారు. కారుణ్యానంద స్వామి సంకల్ప బలమే నేటికీ ఆశ్రమాన్ని నడిపించేందుకు ఆయువుపట్టని అన్నారు. అనేక మంది దాతలు వృద్ధులకు, పిల్లలకు కావాల్సిన వస్తువులను సమకూరుస్తూ, తమ రక్తసంబంధీకులు, బంధువుల పేర్ల మీద అన్నదానాలు నిర్వహిస్తున్నారన్నారు. పదో తారీఖున స్వామివారి జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కాగా.. నాటకంలో కారుణ్యానంద స్వామి పాత్రలో ఆకట్టుకున్న వి.మోహన్ రాజును సత్కరించారు. నాటక సంస్థ నిర్వాహకుడు సాయి మహేష్‌ను అభినందించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్లు పిల్లి నాగేంద్ర ప్రసాద్, నాగులాపల్లి దేవీలక్ష్మణరావు, చల్లంగి ఏడుకొండలు, చిట్టాబత్తుల అనంతలక్ష్మీరాజు, తమ్మిశెట్టి రాధిక, ప్రభాస్ పాల్గొన్నారు.

విజయవాడకు నాయకుల పయనం



విజయవాడకు బయలుదేరిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడలో జరిగిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర స్థాయి ప్రతినిధులు సభకు సిటీ నుంచి పలువురు నాయకులు సోమవారం బయలుదేరి వెళ్లారు. కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సారథ్యంలో వీరు పయనమయ్యారు. వారిలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ఉన్నారు.